ఆమెను చూచి ధర్మకర్త మిక్కిలి జాలిపొందినవాడై పూజారితో " ఈ పడమటివైపు తలుపులు ఎప్పుడూ తెరవక పోవడమే మేలు. నేటినుంచీ ఈవలివైపు తాళంవేసి వేయు చున్నాను. ఈ వైపునకు మీ రెవ్వరును రావద్దు " అని శాసించి నాడు. శాసించి తాళంవేసి పూజారితో పెట్రోమాక్సులైటుతో ధర్మకర్త వెళ్ళిపోయినాడు.

ఆ పురటాలిప్రాణం కుదుటుపడింది. బిడ్డను మెల్లిగా తన పొత్తిలోని కిముడ్చుకొని కాళ్ళు దగ్గఱగా తీసికొని గాఢ నిదరలో నిర్యాణావస్థ ననుభవిస్తోందా అన్నట్టు విలసిల్లి పోయింది.

....

టర్కీలు - గినీలు

టర్కీలు, గినీలు, అంటే అవో రెండు రకాల కోళ్ళు. కథ కాపేరిచ్చి నందు క్కారణం మరేం లేదు. ఆ కోళ్లు ఆ " కాలెనీ " లో పెంచ బడతాయి. " కాలెనీ " అంటే పెద్దవలస రాజ్యం అనుకొనేరు కనుక. రైల్వే కాలెనీ. రైల్వే కాలెనీ అని వీథుల్లో రైళ్లునడవ్వు. రైల్వే యిలాకా నవుకరీవుండే ఏంగ్లో ఇండియన్లు విస్తారంగా కాపురం ఉంటారు. అందుచే దాన్ని రైల్వే కాలనీ అని పిలవడం పరిపాటి. కానైతే, రైళ్లు పక్కనుంచి కూస్తూపోతాయి. పూర్తిగా రైళ్ళకూ ఆ కాలనీకి సంబంధం లేదని అనడానికి వీల్లేదు. సంబంధం ఉండనూ ఉంది లేనూలేదు.

పై దంతా కథకు చెందని ఉపోద్ఘాతమే. అయితేం, తప్పని సరిగా వ్రాయవలసి వస్తాయి కొన్ని సంగతులు. పాఠకుణ్ణి పట్నంలో వోమూలనుంచి ఇంకో మూలకు తీసుకు పోవాలీ అంటే ఎలా చెప్పండి? పట్నంయొక్క వోతట్టున లేనివి, మరో తట్టున యున్నవి స్ఫురింప చేయాలి. చేస్తే కథ మేఘంలా ఈ పక్కనుకదా ఉదయిస్తూ వుందని అనుకోడానికి మనస్సు సిద్ధ పడుతుంది. ఇప్పుడు పై ఉపోద్ఘాతంవల్ల పాఠకుని చిత్త ప్రసన్నత ఏ మూలకు ప్రసరిస్తూ వుంది అని అనుకోను? రాణ్మహేంద్రవరంలో వోమూలకు చేరుకుని యుండాలి. ఏ మూల అది? రైల్వేకాలనీ వున్న మూలకు. కాని రైల్వే కాలనీకి కథకూ సంబంధం లేదన్నాం. అంచేత రైల్వే కాలనీకి కొంచెం అనుకుంటూ వెళ్ళాలి. అక్కడొక లెవెల్ క్రాసింగు. ఆ క్రాసింగు దారితీసే పెద్దరోడ్డు. ఆ రోడ్డున జనం వుండరు. కాని హఠాత్తుగా మోటార్లు వస్తూ పోతూ వుంటాయి. అదీకథకు రంగస్థలం. ఆనవాలు పట్టి ఉంటూ రీపాటికందయున్నా ఆ స్థలం.

చిన్నజాన్ అక్కడ ఆడుకుంటూ యున్నాడు. బుల్లిమేరీ అక్కడ పాడుకుంటూ వుంది. అప్పలమ్మ ఆయా వాళ్ళతో కూడా వుంది. ఆ యా సొంత పిల్లలు రామస్వామిగాడు, ఎటికలమ్మ ఆయాను వెంటాడ్తూ ఏదో ఇసకలో కంచాల్లాంటివి గీసుకుంటూ యున్నారు. సాయంకాలం 5-గంటలు.

ఆయా అప్పలమ్మ! రాక్షసిబొగ్గంత నలుపూను దాని చాయ. కాని హృదయం అంత కటికిదిగా దోచదు. నువుగింజ మాదిరి హృదయంగా తోస్తుంది. అంటే చమురున్న మనిషి అన్నమాట. ఊహ ప్రజ్వలింపజేస్తే నిల్చి, వెలుగుతుంది.

కాంతి యిస్తుంది. తీర్చైన ముఖం, నీటైన చూపు. గోటైన నడక. నీ వెవరవు అని అడిగితే ఇంగ్లీషులో "అయిమ్ ఆయా అప్పలమ్మ" అని జవాబు చెప్పేస్తుంది తిన్నగా. సన్న విడిగా విడివడి సంగీతంలా వినవస్తుంది దాని యాసు. "బేబీ మేరీ!" అని అది ఆ తెల్ల పిల్లల్లో ఒకర్ని పిలుస్తూంటే చెట్లమీద గోరింక పలుకులా వెలిసిపోయిం దానాడు.

రామస్వామి గాడికి ఏడేళ్లు. ఎఱికలమ్మకు అయిదేళ్ళు ఉంటాయి. వాళ్ళిద్దఱూ మామోలు కడజాతి పిల్లలల్లేనే అగపిస్తారు. ఒళ్ళంతా దుమ్మూ ధూళీ. అల్లఱి చిల్లఱ చేష్టలు, కంచెల్లో కఱ్ఱలు విఱవడం, దారే పొయ్యే కుక్కలుంటే వాటి మీదకు రాళ్లు విసరడం. ఇది వాళ్ళ తంతు. ఈ పిల్లలు ఆ యా అప్పలమ్మగారి పిల్లలని యనుకోడానికి సుతలాం వీలగపించదు. ఏం చేతా అంటే ఆ యా అప్పలమ్మ దిరీసే వేఱు. తెల్లని చీర మల్లెపువ్వుల చాయది కట్టింది. వాొల్లెంతో సంతనాగా మల్చి చూపించే వెనక ముందు కత్తిరింపుగల రయిక తొడిగింది. కాలికి ఆకు జోడే అనుకోండి కాని యదో రకం అందమైన ఆకుజోడు. అన్నింటి కంటే చోద్యం! ఒకటో రెండో పూలుపూలు కురుల్లో గ్రుచ్చుకుంది. దాని పిల్లలు ఈ అతతాయి ముండా వాళ్ళని యనుకోవడం ఎట్లా? మఱిన్నీ పలకరించినా ఆదరించి నా అప్పలమ్మ జాన్‌నీ, మేరీనీ, పలకరించేది. ఆదరించేది. రామస్వామిగాణ్ణి, ఎఱికలమ్మనీ, తలపెట్టేదే లేదు. ఇకెల్లా చెప్పండీ యనుకోడం వాళ్లు దీని పిల్లలని?

జాన్! మేరీ! ఇద్దఱూ తెల్లని పిల్లలు! వాళ్ళకు శుభ్రమైన దుస్తులు! జోళ్ళు! మేజోళ్ళు! ఎక్కడకు పోయినాకూడా వోతోపుడు బగ్గీ!

ప్రభుత్వంవారి చట్టాలు యనండి. స్థానిక పరిపాలనం వారి చట్టాలు అనండి. అవి మిక్కిలి చిత్రమైన చట్టాలు. ఒక మనిషిమీద క్కనక మటో మోటారెక్కించి వాణ్ణి కడతేరిస్తే. ఆ మోటారు డ్రైవర్ని హంతకుడంటూ సెషెన్సు కోర్టు దాకా ఈడ్చుకు పోతారు. ఒక్కొక్కప్పుడు ఉరిస్తంభాలుకూడా ఎక్కిస్తారు. కాని మోటారు దుమ్ము యమేషా బీదసాదల ముక్కుల్లో దూరి, వాళ్ళ ఆరోగ్యం దినే దినే నాశనంచేస్తూ తుదకు వాళ్ళ కేషయరోగమో తెచ్చిపెట్టి చంపివేస్తుంటే, అది హత్యగా ఏ "లా" పరిగణించదు. ఆ మహానుభావులందఱూ యతి భోగులూ ! మహా భోగులూ ! దాంతో పాటు నిర్దోషులున్ను ! ప్రపంచం అలా నడుస్తూవుంది భాగ్యవంతులయొక్క ప్రాభవ మీ్మద : ప్రతీవాడూ ఎందుకు భాగ్యవంతుడు కాకూడదు. ప్రతీ వాడూ మోటా రెందుకు ఎక్కకూడదు యని అడగొచ్చు.

ఆ ప్రశ్న నన్నడిగితే నేను జవాబు చెప్పలేనేమోకాని ఆయా అప్పలమ్మను యడిగితే చెబుతుంది. అది యంటుందీ "భాగ్యవంతుడు కావడానికి పుట్టుచేటూ కొంత తాహతు వుండాలి. అదే పెట్టి పుట్టాలన్న సామెత. మటి ఆరోగ్యవంతుడు కావడానికి వేటే తాహతు యక్కర్లేదు. భూమి మీద పడ్డ ప్రతీ ప్రాణికీ ఆరోగ్య మనుభవించడానికి హక్కు వుంది. మంచిగాలి పీల్చడానికి, శుభ్రమైననీరు తాగడానికి, శుచీ, రుచి, పచీగల పదార్థాలు భుజించడానికి, ప్రతీవ్యక్తికీ హక్కువుంది. పక్షులకు భాగ్యం అక్కర్లేదు చూడండి కాని చల్లని గాలినీ, నిర్మలమైన సెలయేటినీ, తియ్యని పండ్లను ఎలా యనుభవిస్తూ వుంటాయో ! అవి వాటి జన్మ స్వార్జితాలే. అలాగే తక్కిన జంతుజాల

విషయమైనన్నీ మానవుడు ఈ పశు పక్ష్యాదుల మాత్రం పాటి చేయడా ? ఆ జన్మ హక్కు వీడనుభవించ నక్కర్లేదా ? మాయ దారి భోగా లనుభవించే భోగలాలసుల యొక్క బళ్ళవెనుక కొట్టే దుమ్మే పీల్చాలా వీడు ? మేడలూ మిద్దెలూ కట్టుకున్న వాళ్ళయొక్క పెఱటిదారుల కుళ్ళు నీళ్లు కడిగి పొయ్యాలా వీడు ? ఎబ్బే ! ఎబ్బే ! ఏమి మనిషి ! ఎందుకు పుట్టిన మనిషి?" అని అంటుంది.

ఆ మాత్రం స్వయం వ్యక్తిత్వం సంపాదించుకుని ఆ జవాబు చెప్పడానికైనా అప్పలమ్మకు ధైర్య మన్నాది ఎలా వచ్చిందో మీకు తెలుసునా ? ఆయా అవబట్టి. అప్పలమ్మే కనక అప్పలమ్మ లాగే వుండి వుంటే, అంత ధైర్యంగా జవాబు చెప్పి యుండదు. కాని ఆయాకంటె పై ఉద్యోగం అది ఎంత తంటాలు పడ్డా సంపాదించ లేకపోయింది. నిజంగా దాని కడుపులో వూహ తెలుసుకుంటే ఎంత వూహ ఉందీ నీ కడుపులో అని అంతా యనీవారే. దానికి నిజంగా ఆ పాళంగా వో వైస్రాయి యయిపోవాలని ఉంది యనుకోండి. ప్రత్యేక భవనం, ప్రత్యే కోద్యానవనం, ప్రత్యేక పరిజనం, ప్రత్యేక వాయువిమానం, అంతా ప్రత్యేక-ప్రత్యేక-ఇత్యాదిగా ఉండి యనుభవించాలని దాని కోరిక. కాని ఎలా ? ఏంగ్లో ఇండియన్ దొరగారి యింట్లో ఆయా పని మానివేస్తే మఱివేఱే చోట పనే దొరకదేమో దానికి పాపం ! పోనీ ముందు జన్మకైనా వైస్రాయి యవుతుందా ?— ముందు జన్మలో ? ఈ జన్మలో నిర్మలమైన గాలి పీల్చడానికే పెట్టి పుట్టని మనిషి ముందు జన్మలో వైస్రాయి ?

ఒక మోటారుకారు వాళ్ళ వెనుతట్టునే బంయి మంది. కంగారెత్తి పోయింది పిల్లలకు. ఆయా అప్పలమ్మ తాను పిల్లల కంటే ఎక్కువగా కంగారు పడిపోయింది.

ఆ మోటారులో ఎవరున్నారో యనే కంగారుకాదు వాళ్ళది. ఆ మోటారుకారు తన దుమ్మును వాళ్ళ కళ్ళల్లోకి ముక్కుల్లోకి కుమ్మి వాళ్ళ మీదనుంచి పోతుందేమోననే భయం. అప్పలమ్మ, గబగబా తల్లికోడి కనక తన రెక్కల క్రిందకు పిల్ల కోళ్ళను లాక్కొన్నట్టు, కేకేస్తూ " జాన్ ! " బేబీ మేరీ " కమ్‌ది సైన్డ్.—ఒరే రామసామిగా ! ఏమేవ్ ఎఱికలమ్మ ఈలా రాండర్రా ! కార్ కార్ యంటూ ఆ నలుగుర్నీకూడా తనయొక్క చేతుల మధ్యకు తీసికుని రోడ్డువంచకు దిగింది.

కార్లో వాళ్లు దొరలు. ఆ దొరలు గబుక్కున కారు ఆపి " ఏయ్ ! అమ్మీ ! " అన్నారు. అప్పలమ్మ గడ గడ లాడింది మొదట. కాని తాను తప్పుచేసింది లేదని తనలో తెలుసుకోని " ఏమండీ బాబూ ! " అంది. " నీ పిల్లల్ని మా పిల్లల్నీ ఆలా కలిపి పట్టుకోకు – మా పిల్లలు చెడిపోతారు. పరిశుభ్రంగా యుండరు " అన్నారు. అప్పలమ్మ అంది : " కారుక్రింద పడి చచ్చిపోతారేమో యని దగ్గరగా తీశాను సర్. ఇందాకట్నుంచీ వేటే వేటేనే ఆడుకుంటూ యున్నారు " అంది.

" చచ్చిపోయినా కలపకూడదు " అన్నారు దొరలు. ఆయా " చిత్తం " అని పైకి సలాంపెట్టి లోపల యనుకుంది " ఆ వాళ్లమాట మనిషి పిల్లల్ని గుఱించా టర్కీలను గినీలను గురించా " అని.

....